క్లుప్తంగా

నిరుపయోగంగా ఫ్రిజ్‌లు



భద్రాచలం బ్రిడ్జి పాయింట్‌లో నిరుపయోగంగా ఉన్న ఫ్రిజ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారులు ఏర్పాటు చేసిన తాగునీటి ఫ్రిజ్‌లు నిరుపయోగంగా మారాయి. నిత్యం నీరు ఉండేలా చూసుకోవడం, పనితీరును పరిశీలించడం వంటి నిర్వహణ పూర్తిగా లోపించింది. దీంతో ఎండలు మండుతున్న వేళ భద్రాచలం వచ్చే భక్తులకు ఆ ఫ్రిజ్‌లు అక్కరకు రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

నిత్యావసరాలు వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులోని మానవసేవ వృద్ధాశ్రమంతో పాటు దివ్యాంగ, అనాథాశ్రమానికి గురువారం దాతలు నిత్యవసర వస్తువులను వితరణగా అందజేశారు. ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ జన్మదినం సందర్భంగా వీటిని అందజేశారు. గారినేపల్లి అశోక్, కోసూరి ఉమాదేవి, కనకదుర్గ, గుంటి రాజేష్, గోపి, కనకశ్రీ, రమాదేవి, ఉమాదేవి, అశోక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

మణుగూరురూరల్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా వర్షాకాలంలో ఆదర్శనగర్ ప్రాంతంలోని డాకూరి వసంతరావు ఇంటి నుండి ముత్యాలమ్మగుడి వరకు రోడ్డంతా వర్షపు నిలిచి బురదమయంగా మారుతోందని, దీంతో పిల్లలు, పెద్దలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో సిసి రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించి ఇప్పటికైనా ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పి.పుల్లయ్య, సీతారాములు, స్వరూప, రాణి, శ్రీనివాసులు, నార మణి, పద్మ తదితరులు పాల్గొన్నారు. దేవి, కానేమల్లీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం వేదికగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈనెల 25న జరగబోయే రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సుకు తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ పాల్గొంటారని, ఈ సదస్సుకు వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎడేళ్ల గణపతి, పల్లంటి రమేష్, బోడ దివ్య, మద్దేటి జయ, తోటమల్ల గోపాలరావు, కొంగూరు శ్యామ్, కార్లపూడి సుందర్ పాల్, పప్పుల జయ, బొజ్జ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: కేసీహెచ్‌పీ నుంచి దుర్గా క్యాంప్ వరకు ఎలాంటి లైట్లు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఓసీ-2 -కేపీయూజీ మైన్ వైపు వెళ్లే రహదారి మధ్యలో ఉన్న అండర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదే విధంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఏర్పాటైన రహదారిపై గుంతలు పూడ్చాలని కోరారు. నాయకులు పవన్ కుమార్, రమేశ్, శ్రీనివాస్, రఫీ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పరుచూరి శ్రీనివాసరావు-జ్యోతి దంపతులు, సాయివంశీకృష్ణ-సుప్రజ దంపతులు, నాగవెంకటశివసాయి ఆర్యన్, రోహిత్‌లు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాతల దంపతులను ఆలయకమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లలో నాణ్యతకు తిలోదకాలు

- ఇష్టారాజ్యంగా రహదారుల నిర్మాణం
- సైడ్‌బర్మ్‌లు లేక ప్రమాదాలు
- పట్టింపులేని అధికారులు



లక్ష్మీనగరం గ్రామంలోని సీసీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు



లక్ష్మీనగరంలో సైడ్‌బర్మ్ లేకుండా సీసీ రహదారి

దుమ్ముగూడెం మండలంలో ఎమ్మెల్యే, ఎంపీ కోటా కింద ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద 138 పనులకు గాను రూ.6.60కోట్లు మంజూరు అయ్యాయి. కాగా వీటిలో ఎమ్మెల్యే, ఎంపీ కోటాలోని దాదాపు 70 పనులు పూర్తికాగా మరో ఐదు పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. మరో 63 పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటి వరకు చేపట్టిన 70 పనుల్లో ఎక్కడ కూడా సైడ్‌బర్మ్ అనేది నిర్మించలేదు.. సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభించి పనులు పూర్తి చేసి దాదాపు 50రోజులు దాటినప్పటికీ సైర్మాణంలో గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

138 పనులు.. రూ.6.60 కోట్ల నిధులు

దుమ్ముగూడెం: మండలంలో చేపట్టి సీసీ రోడ్ల నిర్మాణాలు సైడ్‌బర్మ్ నిర్మించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతలకు తిలోదకాలు ఇచ్చినట్లు ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు సైడ్‌బర్మ్ పోయకపోవడంతో రోడ్డు పక్కన ఎగుడుదిగుడు ఏర్పడి కార్ల వంటి వాహనాలు దిగబడుతున్నాయి. ద్విచక్ర వాహనాలు అయితే స్కిడ్ అయ్యి పడిపోతున్నాయి.

ఇష్టానుసారంగా నిర్మాణాలు..

పనులు పొందిన గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారంగా సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టినట్టు తెలుస్తోంది. నిర్మాణంలో నాసిరకమైన ఇసుక వాడటంతో పాటు ఇసుక శాతం కంటే కంకర పొడి (డస్ట్) ఎక్కువగా వాడారు. తక్కువ గ్రేడ్ సిమెంట్ వినియోగిస్తూ ఒక్క లోడ్‌కి సుమారు 10 కట్టల సిమెంట్ ఉపయోగానికి 5 లేదా 6 బస్తాలను వినియోగించి నాణ్యత విస్మరించినట్లు తెలుస్తోంది. పది రోజుల పాటు వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉండగా ఎక్కడా కూడా వాటరింగ్ జరగలేదని, ఒకటి రెండు రోజులు నామామాత్రంగా వాటర్ క్యూరింగ్ చేశారని స్థానికులు చెబుతున్నారు. నాసిరకం పనులు చేయడం వల్ల ఇప్పటికే దుమ్ముగూడెం, లక్ష్మీనగరం గ్రామాల్లో వేసిన సీసీ రోడ్లపై పగుళ్లు ఏర్పడ్డాయి.

బిల్లుల కోసమేనా..?

ఆర్థిక సంవత్సరం చివరిలోగా పనులు పూర్తి చేసి రికార్డు పొందుపరిచి, ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తే బిల్లులు త్వరగా వచ్చే అవకాశముంది. దీనివల్లే ఆగమేఘాలతో, నాణ్యత లోపంతో పనులు చేసినట్లు తెలుస్తోంది. పనులు పూర్తికాని పక్షంలో వచ్చే ఆర్థిక సంవత్సరం లెక్కలోకి వెళ్లనున్నట్లు సమాచారం. దీంతో బిల్లులు త్వరగా పొందేందుకు గాను నాణ్యతను గాలికొదిలి పనులు చేశారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లు నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నిర్మించడంతో మూన్నాళ్లకే పగుళ్లు ఏర్పడతాయి. డస్ట్ వినియోగం మూలంగా రోడ్డు నాణ్యత దెబ్బతిని కొంతకాలానికే కంకర తేలిపోతుంది. దీనిపై దృష్టి సారించి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యత లోపించింది..



మండలంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో గుత్తేదారులు నాణ్యతలకు తిలోదకాలు ఇచ్చారు. రోడ్ల నిర్మాణంలో నాసిరకంగా పనులు చేపట్టారు. వాటర్ క్యూరింగ్ ఎక్కడా చేయలేదు. దీంతో రోడ్లపై అప్పుడే పగుళ్లు ఏర్పడ్డాయి.

– కంద్రపు త్రినాథ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు

సైడ్‌బర్మ్ నిర్మాణం చేయిస్తాం..



మండలంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి సైడ్‌బర్మ్‌ను ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. పనుల నాణ్యతను పరిశీలించి నిబంధనల మేరకు బిల్లులు చేస్తాం. ఇంతవరకు ఇంకా బిల్లులు చెల్లింపు జరగలేదు.

– గోపి శ్రీరామ్, పీఆర్ ఏఈ

లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఇంపాక్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరబాబు

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని, ఆ లక్ష్యాన్ని సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు జువ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. గురువారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపయోగపడేలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ బాధ్యులు కోటేశ్వరరావు, ప్రొఫెసర్లు, కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరయ్యారు.

ఏఐటీయూసీ స్ట్రక్చర్ సమావేశం

మణుగూరుటౌన్: ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏఐటీయూసీ స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన డ్రిల్స్, గ్రేడర్స్, షావెల్స్ తదితర యంత్రాలను ఎప్పటికప్పుడు తొలగించి, కొత్త వాటితో రీప్లేస్ చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ రామనర్సయ్య కోరారు. కేపీయూజీ మైన్‌లో గమ్ షూస్ లేకుండా పనిచేయాలని ఒత్తిడి చేయడం, దానివల్ల కార్మికులు ఇబ్బందులు పడడం, కేసీహెచ్‌పీ నుంచి ఓసీ–2 కొత్త సైట్ ఆఫీస్ వరకు మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లు అవసరముండడం తదితర ఏరియా సమస్యలను ఏఐటీయూసీ నాయకులు జీఎం ఎదుట ప్రస్తావించారు. జీఎం దుర్గం రాంచందర్ ఏజెండా అంశాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించేందుకు ఆయా విభాగాలను ఆదేశించారు. సమావేశంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, శ్రీనివాస్, వెంకట్రావ్, రమేశ్, మేరీకుమారి, మదన్ నాయక్, వెంకట రామారావు, ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు ఉన్నారు.



ఏఐటీయూసీ నాయకులతో చర్చిస్తున్న జీఎం రాంచందర్

పీహెచ్‌డీకి సహకరించరూ..!

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దళిత విద్యార్థి బర్ల దిలీప్ పీహెచ్‌డీ చేసేందుకు ఆర్థిక సహకారానికి ఎదురు చూస్తున్నాడు. దిలీప్ అమెరికాలోని ప్రతిష్టాత్మక సెయింట్ లూయిస్ యూనివర్శిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశాడు. గురువారం మాస్టర్ డిగ్రీ పట్టా అందుకున్నాడు. దిలీప్ తల్లిదండ్రులు తిరుమలరావు, వాణి ఆర్థిక స్తోమత లేకపోయినా కూలి చేసుకుంటూ చదివించారు. కాగా, ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేయాలని సంకల్పంతో ఉన్న తనకు ప్రభుత్వం సహకారం అందించాలని దిలీప్ కోరుతున్నాడు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే పాయం చొరవ తీసుకొని ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఆ డిమాండ్ సరికాదు..

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గాన్ని ఎస్సీ నియోజకవర్గంగా మారుస్తూ ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని మాల మహానాడు డిమాండ్ చేయడం పూర్తిగా అవివేకమైన చర్యగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అభివర్ణించింది. ఈ మేరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూప సీతయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం నియోజకవర్గం పూర్తిగా 5వ షెడ్యూల్ భూభాగంలో విస్తరించి ఉందని, ఈ విషయంపై కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడడం గర్హనీయమని అన్నారు. తక్షణమే ఆ డిమాండ్‌ను ఉపసంహరించుకోవాలని మాలమహానాడుకు సూచించారు.

ఇసుక క్వారీలను నిలిపివేయాలి



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జీఎస్పీ నాయకులు

చర్ల: చర్ల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఇసుక క్వారీలను తక్షణమే నిలిపివేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సుబ్బంపేట పంచాయితీలో కొనసాగుతున్న ఇసుక రీచ్‌లను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గొల్లగూడెం, బీఎస్ రామయ్యనగర్‌లకు ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేనప్పటికీ రామాంజపుర, రేగుంట గ్రామాల్లో రాత్రికి రాత్రే 50 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీశారని ఆయన అన్నారు. అనుమతులు లేకుండా డంపింగ్ చేసిన ఇసుకను తక్షణమే రెవెన్యూ అధికారులు సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, సుధాకర్, శ్రీరాంమూర్తి, వెంకటేశ్, ప్రకాశ్, చందర్‌రావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిని పట్టించుకోరా?

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట–మల్లెలమడుగు గ్రామాల మధ్య రహదారి లోలెవల్ వంతెన వద్ద గత ఏడాది కోతకు గురైంది. కోతకు గురైన రహదారిని ఆ రోజే పరిశీలించిన ఆర్‌అండ్‌బీ అధికారులు నేటి వరకు రహదారి మరమ్మతులకు ఎలాంటి చర్యలూ.. చేపట్టలేదు. ఆ మరునాడే బీటలు బారిన రహదారిపై జేసీబీతో బీటలు బారిన వరకు తొలగించారు. ఆ గుంతను ఎనిమిది నెలలు గడిచినా నేటి వరకు పూడ్చలేదు. ఆ గుంత వద్ద వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి వెలుతూరు ఉండకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నేటి వరకు మరమ్మతులు చేపట్టని రహదారి

శాంతి కమిటీ సమావేశం



మత పెద్దలతో సమావేశం నిర్వహిస్తున్న ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

భద్రాచలంఅర్బన్: ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని గురువారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ మాట్లాడుతూ.. ముఖ్యంగా బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించకూడదని, చిన్న ఎద్దులను కొయ్యకూడదని సూచించారు. వెటర్నరీ డాక్టర్ ధృవీకరించిన పశువులను మాత్రమే వధించాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ యువకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూదని వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్సై తిరుపతి, భద్రాచలం మత పెద్దలు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. మండలానికి కోట్ల నిధులు సమకూర్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కమిషనర్ ప్రసాద్, మండల నాయకులు నవీన్, శివకుమార్, కూచిపూడి బాబు, గణేశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఈఓపై సొసైటీ డైరెక్టర్ల ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: ఓ సొసైటీ సీఈవోపై కొంత మంది సొసైటీ డైరెక్టర్లు, బాధిత రైతులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. అశ్వారావుపేట సహకార సంఘంలో గత కొన్నేళ్లుగా సీఈఓగా పని చేస్తున్న మానేపల్లి విజయ్‌బాబు తన విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం, సొసైటీ రుణాలు ఇవ్వడంలో జాప్యం చేయడంతోపాటు ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు, అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్థానిక సొసైటీ డైరెక్టర్లు బత్తిన పార్థసారధి, సత్తిబాబు, గుడవర్తి వెంకటేశ్వరరావు, ఏ.వెంకటరామారావుతోపాటు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు లిఖిత పూర్వకంగా ఇటీవలె కొత్తగూడెం డీసీఓకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో సదరు సీఈఓ విజయ్‌బాబు రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై, ఒక బస్తాకు మూడు కేజీల తరుగు తీసి దోపిడీ చేస్తున్నట్లు ఆరోపించారు. అలాగే సొసైటీ పాలకవర్గాన్ని విస్మరించడం, ప్రొటోకాల్ పాటించడం లేదని వెల్లడించారు.

తక్షణమే వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కొత్తగూడెం డీసీఓ స్పందించి ప్రత్యేకాధికారి వీరేశాన్ని విచారణాధికారిగా నియమించారు. ఈ విచారణాధికారి అశ్వారావుపేట సొసైటీ కార్యాలయంలో శుక్రవారం విచారణకు రానున్నట్లు సొసైటీ డైరెక్టర్లు, రైతులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెపై సమావేశం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు పటాన్ జలాల్‌ఖాన్

అశ్వారావుపేటరూరల్: కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా జులై 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్షం నాయకులు కోరారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో జరిగిన అఖిల పక్షం సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా, మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీపీఐ నాయకులు ఎస్‌డీ సలీం, గన్నిన రామకృష్ణ, ఎన్డీ నాయకులు గోగినపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, ఏఐటీయూసీ నాయకులు పటాన్ జలాల్‌ఖాన్, నూకవరపు విజయకాంత్, సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్, నరసింహారావు, ఎస్‌కె.రెహమత్, ముర్తుజా పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

మణుగూరురూరల్: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ సభ్యుడు దోసపాటి నాగేశ్వరరావుకు గురువారం నాయకులు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు, హమాలీ యూనియన్ నాయకులు బుర్ర సత్యనారాయణ, రమేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్ల కోసమే తవ్వకాలు'

చర్ల: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా చేపట్టిన తవ్వకాలు కేవలం కాంట్రాక్టర్ల లాభాల కోసమేనని, వీటి వల్ల గిరిజనులకు నామమాత్రపు ఉపయోగమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి ఆరోపించారు. గురువారం చర్లలోని బీఎస్ రామయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్ల మండలంలోని కుదునూరు నుంచి సుబ్బంపేట వరకు గిరిజన మహిళా సొసైటీల పేరుతో గోదావరి నదిలో చేపట్టిన ఇసుక తవ్వకాలు కేవలం కాంట్రాక్టర్లకు మాత్రమే లబ్ధి చేకురుస్తున్నాయని అన్నారు. కాంట్రాక్టర్లు గిరిజన మహిళా సొసైటీలను మోసం చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు, నాయకులు పొడుపుగంటి సమ్మక్క పామారు బాలాజీ పాల్గొన్నారు.

ఈ ఊరికి నిద్ర కరువు

- నిత్యం లారీల రాకపోకలు.. ప్రమాదాలతో హడల్
- దుమ్మూధూళితో అవస్థలు
- తాత్కాలిక హామీలతోనే సరి



మంగళవారం లారీలను అడ్డుకున్న గ్రామస్తులు.. మాట్లాడుతున్న పోలీసులు..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని రాజుపేట గ్రామస్తుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఒక వైపు బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లలో పగుళ్లు, మరోవైపు బొగ్గు, ఇసుక లారీల మితిమీరిన వేగంతో తరచూ ప్రమాదాలు గ్రామస్తులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉన్న స్పీడ్ బ్రేకర్లు తీసేయడం, వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన డ్రమ్ములను సైతం లారీ డ్రైవర్లు ఢీ కొంటుండంతో అప్యాయంగా పెంచుకున్న పశువులు, పక్షులు, తోటి స్నేహితులు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో స్థానికులు క్షణం క్షణం భయం భయంగా బతుకీడుస్తున్నారు.

డిమాండ్లు అనేకం..

నిత్యం మణుగూరు ఓసీ నుంచి బీటీపీఎస్‌కు వందల టిప్పర్లు, ఇసుక లారీలు రాజుపేట మీద నుంచే వెళ్తాయి. వీటి వల్ల వస్తున్న దుమ్ము, ధూళికి, ఇసుక లారీలకు వాటర్ ట్యాంకర్లతో గంటకు రెండు ట్రిప్పులు రోడ్డుపై నీళ్లు కొట్టాలనే డిమాండ్ ఉంది. అదేవిధంగా కొందరు మద్యం సేవించి మితిమీరిన వేగంతో ప్రమాదాలకు పాల్పడడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా లారీలు నడుపుతున్న నేపథ్యంలో పోలీసుల తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాల్సి ఉంది. తొలగించిన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వేగాన్ని నియంత్రించాలని రాజుపేట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ప్రమాదాలు జరిగి పశువులు, స్థానికులు ప్రమాదాలకు గురైన సమయాల్లో వాహనాలు నిలిపివేస్తున్నా ఉపయోగం లేకుండా పోయింది.

హామీలు బుట్టదాఖలు

తరచూ రాజుపేటలో జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో అటువైపుగా తిరిగే బొగ్గు ఇసుక లారీలు రాజుపేట గ్రామస్తులు నిలిపివేయడం, దీంతో సింగరేణి అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేయడం, సింగరేణి సెక్యూరిటీ అధికారులు రెండు రోజుల్లో ఆ గ్రామస్తుల డిమాండ్స్ నెరవేరుస్తామని హామీలు ఇవ్వడం నిత్యకృత్యంలా మారింది.

అయితే, రాజుపేటను పట్టించుకున్న వారు లేరు. ఒకవైపు మున్సిపాలిటీ వాహనాలు చెత్త సేకరించక, వీధి లైట్లు వెలగక, మరోవైపు ప్రమాదాలు, విష కీటకాల సంచారంతో బతకాలో చావాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న గూడును వదిలిపెట్టి వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని తమ సమస్యను ఆలకించి పరిష్కరించాలని కోరుతున్నారు.